# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 01-11-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ జాతీయ యువజన అవార్డుల కోసం యువకులు దరఖాస్తు చేసుకోవాలని కేంద్ర యువజన వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా పిలుపునిచ్చారు.
- ❖ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ పలు రాష్ట్రాల అవతరణ దినోత్సవాల సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.
- ❖ నమో డ్రోన్ దీదీ కార్యాచరణ మార్గదర్శకాలను కేంద్ర ప్రభుత్వం ఈరోజు విడుదల చేసింది.
- ❖ దీపావళి సందర్భంగా నిర్వహించే స్టాక్ మార్కెట్ ప్రత్యేక ముహూరత్ ట్రేడింగ్ లో సూచీలు ఈరోజు లాభాల్లో ముగిశాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ యువజన అవార్డుల కోసం అర్హులైన యువకులు దరఖాస్తు చేసుకోవాలని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా పిలుపునిచ్చారు. ఆరోగ్యం, మానవ హక్కుల ప్రమోషన్, క్రియాశీల పౌరసత్వం, సమాజ సేవ వంటి వివిధ రంగాల అభివృద్ధి, సామాజిక సేవలలో అద్భుతమైన పనితీరును కనబరిచిన 15 నుండి 29 సంవత్సరాల మధ్య వయస్సు గల యువకులు, సంస్థలకు ఈ అవార్డును ప్రదానం చేస్తారు. ఈ అవార్డులో పతకం, ప్రశంసాపత్రంతో పాటు, లక్ష రూపాయల నగదు బహుమతి, సంస్థకు 3 లక్షల రూపాయల నగదు బహుమతి ఉంటుంది. ఈ అవార్డులు కేవలం ప్రశంసలు మాత్రమే కాదని, యువ నాయకత్వంలో ప్రగతిశీల, సమ్మిళిత భారతదేశాన్ని పెంపొందించే వేడుకని కేంద్రమంత్రి దృశ్యమాధ్యమ సందేశంలో పేర్కొంటూ..

(వాయిస్ 35 సెకన్లు)

జాతీయ యువజన అవార్డులు 2022–23 సంవత్సరానికి గాను ధరఖాస్తుల స్వీకరణ ఈనెల 15వ తేదీ వరకు కొనసాగుతుంది. మరిన్ని వివరాలకు హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారిక వెబ్ సైట్ ను సందర్శించవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ ఈరోజు ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హర్యానా, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, పంజాబ్, తమిళనాడు, లక్షద్వీప్, పుదుచ్చేరి ప్రజలకు ఆయా రాష్ట్రాల అవతరణ దినోత్సవాల సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. దేశ అభివృద్ధిలో ఈ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రజలు చేసిన కృషిని రాష్ట్రపతి కొనియాడారు. ఈ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు దేశ శాంతి, శ్రేయస్సుకు దోహదపడేలా, అభివృద్ధి చెందాలని ఉప రాష్ట్రపతి ఆకాంక్షించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అహ్మదాబాద్‌లోని పిరానాలో వ్యర్థాల నుంచి ఇంధన ఉత్పత్తి చేసే అతిపెద్ద ప్లాంట్‌ను కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఈరోజు ప్రారంభించారు. 375 కోట్ల రూపాయలతో పీపీపీ మోడల్‌లో పరిశ్రమను ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్ రోజుకు 1 వేల మెట్రిక్ టన్నుల ఘన వ్యర్థాల నుంచి 15 మెగావాట్ల శక్తిని ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉంది. అహ్మదాబాద్ లో మొదటి వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ గా ఇది హరిత భవిష్యత్ నిర్మాణానికి దోహదపడుతుందని అమిత్ షా పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహారాష్ట్రలో ఈనెల 20న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో 288 అసెంబ్లీ స్థానాల్లో పోటీపడేందుకు మొత్తం 7 వేల 994 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆ రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు వెల్లడించారు. వారిలో 921 మంది నామినేషన్ల పేపర్లను అధికారులు తిరస్కరించామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పేర్కొన్నారు. అక్టోబర్ 30న నామినేషన్ పత్రాల పరిశీలన నవంబర్ 4న అభ్యర్థిత్వాల ఉపసంహరణకు కాగా, ఒకే విడతలో జరిగే ఈ ఎన్నికల ఫలితాలు నవంబరు 23న వెలువడనున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కాల్పుల విరమణకు వ్యతిరేకంగా.. ఇజ్రాయెల్ దాడులు చేస్తోందని లెబనాన్ ప్రధానమంత్రి నజీబ్ మికాటి అన్నారు. లెబనాన్‌లోని వివిధ ప్రాంతాలపై కొనసాగుతున్న దాడులు నేపథ్యంలో ఈ వాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్ సంధి ఒప్పందం కుదుర్చుకోవడానికి కాకుండా.. యుద్ధం తీవ్రతను పెంచేందుకే యత్నిస్తుందని అన్నారు. అమెరికా ఎన్నికలు జరగడానికి ముందే ఇజ్రాయెల్-హెజ్‌బొల్లా యుద్ధంలో కాల్పుల విరమణ సాధ్యమవుతుందని అమెరికా రాయబారి అమోస్ హోచ్‌స్టెయిన్ చెప్పారని ఆయన పేర్కొన్నారు. సెప్టెంబర్ 23న ఇజ్రాయెల్ లెబనాన్‌పై చేసిన దాడులలో ఇప్పటి వరకు 1,829 మంది ప్రాణాలు కోల్పోయినట్లుగా ఆ దేశ ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. మరోవైపు లెబనాన్‌లోని హెజ్‌బొల్లా సంస్థకు చెందిన 70 శాతం డ్రోన్లను ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ ప్రకటించింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ప్రభుత్వ పథకం నమో డ్రోన్ దీదీ కార్యాచరణ మార్గదర్శకాలను ప్రభుత్వం ఈరోజు విడుదల చేసింది. వెయ్యి 261 కోట్ల రూపాయలతో దీన్ దయాళ్ అంత్యోదయ యోజన - జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ కింద మహిళా స్వయం సహాయక బృందాలకు ఈ పథకం ద్వారా డ్రోన్‌లను అందించేందుకు కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. 2024-25 నుండి 2025-2026 మధ్య కాలంలో ఎంపిక చేసిన 14 వేల 500 మహిళా స్వయం సహాయక బృందాలకు డ్రోన్‌లను అందించడం ఈ పథకం లక్ష్యం. మహిళా స్వయం సహాయక బృందాల సభ్యుల్లో ఒకరు తప్పనిసరిగా డ్రోన్ పైలట్ శిక్షణ, వ్యవసాయ ప్రయోజనం కోసం అదనపు శిక్షణతో కూడిన 15 రోజుల అదనపు శిక్షణ కోసం ఎంపిక చేయబడతారు. నమో డ్రోన్ దీదీ స్కీమ్‌ను సత్వరమే అమలు చేయడానికి ఈ కార్యాచరణ మార్గదర్శకాలను ఉపయోగించుకోవాలని మంత్రిత్వ శాఖ కోరింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో వస్తు సేవల పన్ను వసూళ్లు గణనీయ స్థాయిలో నమోదయ్యాయని కేంద్రం వెల్లడించింది. అక్టోబర్ నెలలో 1.87 లక్షల కోట్ల రూపాయలు వసూలయ్యాయని, ఇందులో సీజీఎస్టీ రూపంలో 33 వేల 821 కోట్ల రూపాయలు, ఎస్‌జీఎస్టీ రూపంలో 41 వేల 864 కోట్ల రూపాయలు, ఐజీఎస్టీ రూపంలో 99 వేల 111 కోట్ల రూపాయలు సమకూరాయి. సెస్సుల రూపంలో మరో 12 వేల 550 కోట్ల రూపాయలు వచ్చాయి.

గత ఏడాది అక్టోబర్ నెల వసూలైన 1.72 లక్షల కోట్ల రూపాయలతో పోలిస్తే జీఎస్టీ వసూళ్లలో 8.9 శాతం వృద్ధి నమోదైంది. దేశీయ లావాదేవీలు 10.6 శాతం వృద్ధితో 1.42 లక్షల కోట్ల రూపాయలుగా నమోదయ్యాయి. దిగుమతులపై విధించిన పన్నులు 4 శాతం మేర పెరిగి 45 వేల 096 కోట్ల రూపాయలు వసూలైనట్లు కేంద్రం తెలియజేసింది. అక్టోబర్ నెలలో 19 వేల 306 కోట్ల రూపాయలు రిఫండ్లు జారీ చేసినట్లు పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ - అమెరికా సంయుక్తంగా నిర్వహించే స్పెషల్ ఫోర్సెస్ ఎక్సర్సైజ్ “వజ్ర ప్రహార్” 15వ ఎడిషన్ కోసం భారత ఆర్మీ బృందం ఈరోజు బయలుదేరింది. యుఎస్‌లో ఇడాహోలోని ఆర్చర్డ్ కంబాట్ శిక్షణ కేంద్రంలో రేపటి నుండి నవంబర్ 22 వరకు ఈ విన్యాసాలు నిర్వహించబడతాయి. భారత్, అమెరికా సైనికుల మధ్య ఈ ఏడాదిలో ఇది రెండో విన్యాసం. మొదటిది.. యుద్ధ్ అభ్యాస్ సెప్టెంబర్‌లో రాజస్థాన్‌లో నిర్వహించబడింది. జాయింట్ ఎక్సర్‌సైజ్‌లో పాల్గొంటున్న ఇరుదేశాల బృందంలో ఒక్కో దేశం తరపున 45 మంది సిబ్బంది ఉంటారని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇరు దేశాల మధ్య సైనిక సహకారాన్ని ప్రోత్సహించడం “వజ్ర ప్రహార్” విన్యాశాల ప్రధాన లక్ష్యం.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కొత్త రైలు టికెట్ అడ్వాన్స్ రిజర్వేషన్ బుకింగ్ నిబంధనలు ఈరోజు నుంచి అమల్లోకి వచ్చాయి. రైళ్లలో ముందస్తు రిజర్వేషన్ల గడువును 120 రోజుల నుంచి 60 రోజులకు రైల్వే శాఖ తగ్గించింది. అయితే, అక్టోబర్ 31 వరకు చేసిన అన్ని రిజర్వేషన్ బుకింగ్‌లు అలాగే ఉంటాయని తెలిపింది. విదేశీ పర్యాటకుల కోసం 365 రోజుల అడ్వాన్స్ రిజర్వేషన్ బుకింగ్ పరిమితిలో ఎలాంటి మార్పు లేదని మంత్రిత్వ శాఖ తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దీపావళి సందర్భంగా సంవత్సరం నిర్వహించే స్టాక్ మార్కెట్ ప్రత్యేక ముహూరత్ ట్రేడింగ్ లో సూచీలు ఈరోజు లాభాల్లో ముగిశాయి. గంటపాటు నిర్వహించిన ఈ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 300 పాయింట్లకు పైగా లాభపడగా.. నిఫ్టీ 24 వేల 300 వద్ద ముగిసింది. ముహూరత్ ట్రేడింగ్ అనేది హిందూ క్యాలెండర్ సంవత్సరం (సంవత్ 2081) ప్రారంభాన్ని సూచిస్తూ దీపావళి సందర్భంగా నిర్వహించే ప్రత్యేక ట్రేడింగ్ సెషన్. సాయంత్రం 6 నుండి 7 గంటల మధ్య ఈ ప్రత్యేక ట్రేడింగ్ సెషన్ కొనసాగింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మూడు టెస్టుల సిరీస్‌లో భాగంగా ముంబయిలో వాంఖడే స్టేడియం వేదికగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న చివరి క్రికెట్ టెస్ట్ మ్యాచ్‌లో భారత్ మొదటి రోజు ఆటముగిసే సమయానికి 4 వికెట్లు కోల్పోయి 86 పరుగులు సాధించింది. ఇంకా 149 పరుగులు వెనకబడి ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ 235 పరుగులకు ఆలౌట్ అయ్యింది. కాగా ఈ మ్యాచ్‌లో తొలి రోజు 5 వికెట్లు తీసిన భారత్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా భారత టెస్టు క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన ఐదవ ఆటగాడిగా నిలిచాడు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =